# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-08-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక చింతనను మమేకం చేస్తూ.. గోదావరి పుష్కరాలను నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.

- ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావు ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు.

- అనంతపురం జిల్లా రాయదుర్గంలో 1,325 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులకు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు.

- పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల రంగాల్లో సహకారం కోసం యూకే ప్రభుత్వంతో రాష్ట్ర మున్సిపల్ శాఖ ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

- వెలిగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి ఈనెల 31న ప్రారంభించబోతున్నారని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి వెల్లడించారు.

====================

ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక చింతనను మమేకం చేస్తూ.. గోదావరి పుష్కరాలను నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఎక్కడా పవిత్రత దెబ్బతినకుండా, భక్తులకు సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు పుష్కరాలు అత్యంత వైభవంగా జరపాలని చెప్పారు. పుష్కరాల నిర్వహణలో స్థానిక ప్రజలను కూడా భాగస్వాములను

చేయాలన్నారు. పుష్కరాల కోసం 4 వేల 026 కోట్ల రూపాయలతో చేపట్టిన 4 వేల 932 పనులకు సంబంధించి పురోగతిపై అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి ఈరోజు సమీక్షించారు. పుష్కరాలకు ఇంకా 10 నెలల సమయమే ఉన్నందున త్వరితగతిన అన్ని పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలన్నారు.

====================

ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడ లోక్‌భవన్‌లో ఈరోజు జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆయనతో ఏపీ లోకాయుక్తగా ప్రమాణం చేయించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరై జస్టిస్ మల్లిఖార్జునరావుకు అభినందనలు తెలిపారు. అనంతరం లోక్ భవన్ లో ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు గవర్నర్, ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, న్యాయ శాఖకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

====================

అనంతపురం జిల్లా రాయదుర్గంలో సుజ్లాన్ సంస్థ ఏర్పాటు చేయనున్న 1,325 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఈరోజు శంకుస్థాపన చేశారు. కణేకల్లు మండలం హులికెర గ్రామంలో సుజ్లాన్ సంస్థకు చెందిన ఎస్-144 నూతన బ్లేడ్ ఉత్పత్తి లైన్లను లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో పలు కంపెనీలు నూతన ప్రాజెక్టులు ప్రారంభించడం జరుగుతోందని చెప్పారు. సుజ్లాన్ సంస్థ 1,325 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులను ప్రారంభించడం శుభపరిణామమన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా అనంతపురం జిల్లా అభివృద్ధితో పాటు స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి లోకేశ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల రంగాల్లో దీర్ఘకాలిక సహకారం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం - యునైటెడ్ కింగ్డమ్ ప్రభుత్వం మధ్య ఈరోజు ఒక అవగాహన ఒప్పందం (MoU) కుదిరింది. రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ సమక్షంలో మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి, యూకే ప్రతినిధులు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. మున్సిపాలిటీల అభివృద్ధికి యూకే ప్రభుత్వం సాంకేతిక సహకారం అందించనున్నదని మంత్రి నారాయణ తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ 5 నగరాల్లో అమరావతి ఒకటిగా మారుతుందన్నారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అర్బన్ ప్లానింగ్, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్, అర్బన్ మొబిలిటీపై కలిసి పని చేస్తామన్నారు. మున్సిపాలిటీలలో 40 వేల కోట్ల రూపాయల విలువైన పనులు ప్రారంభించామని మంత్రి నారాయణ వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నా మౌలిక వసతులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.

విరామం

====================

వెలిగొండ ప్రాజెక్టును ఈ నెల 31న ప్రారంభించబోతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా రైతుల పొలాలకు నీరు అందిస్తామన్నారు. ఈ ప్రాజెక్టుతో పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజల ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామంటూ భరోసా ఇచ్చారు. ఇంటింటికి కుళాయి ద్వారా ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. "వెలిగొండ జలసిరులు - అభివృద్ధికి రెక్కలు" అంటూ ముఖ్యమంత్రి చేసిన సామాజిక మాధ్యమ పోస్ట్ లో 30 ఏళ్ల క్రితం వెలిగొండ ప్రాజెక్టుకు తాను శంకుస్థాపన చేసిన ఫోటోను పంచుకున్నారు. ఇక ఎల్ నినో పరిస్థితుల్లో కూడా రైతులకు సాగు నీరందించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ...

(వాయిస్ 20 సెకన్లు)

====================

రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా జూనియర్ వైద్యులు చేస్తున్న సమ్మెపై దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు ఈరోజు విచారించింది. ఈ సందర్భంగా సమ్మె విరమిస్తున్నట్లు రాష్ట్ర జూనియర్ వైద్యుల సంఘం ప్రకటించింది. తమ డిమాండ్లు పరిష్కరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని సంఘం కోర్ట్ ను అభ్యర్థించింది. రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో సమ్మె విరమిస్తున్నట్లు హైకోర్టుకు వైద్యుల సంఘం నివేదించింది. జూనియర్ డాక్టర్లు తమకు ఇచ్చే ఉపకార వేతనాన్ని 30 శాతం పెంచాలని, వైద్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని.. అలాగే ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయసును 65 సంవత్సరాలకు పెంచకూడదని డిమాండ్ చేస్తూ గత కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్నారు.

====================

ప్రధానమంత్రి  ఫార్మలైజేషన్ అఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ (PMFME)అమలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జాతీయ స్థాయి అవార్డు లభించింది. పీఎం ఎఫ్ఎంఈ  సీడ్ క్యాపిటల్ కింద రుణాలు అందచేయడంలో ఆంధ్రప్రదేశ్ లోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కు జాతీయ స్థాయి అవార్డును కేంద్ర ఆహారశుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ న్యూఢిల్లీలో ఈరోజు అందజేశారు. కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిన్నటి నుండి జరుగుతున్న దేశవ్యాప్త పీఎం ఎఫ్ఎంఈ కాంక్లేవ్ లో ఈ అవార్డును బహుకరించారు. పీఎం ఎఫ్ఎంఈ సీడ్ క్యాపిటల్ కాంపోనెంట్ కింద ఆమోదించబడిన పనితీరు ప్రమాణాల ఆధారంగా స్వయం సహాయక సంఘ మహిళలకు అందిస్తున్న సేవలు, నిధుల వినియోగం, యూనిట్ల అభివృద్ధి తదితర అంశాల్లో వివిధ రాష్ట్రాల గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థల పనితీరును కేంద్ర ఆహార శుద్ధి మంత్రిత్వ శాఖ మూల్యాంకనం చేసింది. ఈ మూల్యాంకనంలో సెర్ప్- ఏపీ (SERP–AP) సమగ్ర పనితీరు ఆధారంగా ఉత్తమ పనితీరు కనబరిచిన విజేతల్లో ఒకటిగా ఎంపికైంది.

====================

స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పని చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆ పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఇవి కేవలం గెలుపోటములను నిర్ణయించే ఎన్నికలు మాత్రమే కావని, పార్టీ కోసం నిరంతరం కష్టపడే కార్యకర్తల కోసం నిలబడాల్సిన కీలకమైన ఎన్నికలని ఆయన స్పష్టం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గస్థాయి ముఖ్యనేతలతో ఈరోజు ఆయన సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయి నేతలకు జగన్ మోహన్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికలు జరపాలని భావిస్తోందని, అలా జరగడం ఒక విధంగా తమకు మంచిదే అవుతుందన్నారు. ప్రత్యక్ష ఎన్నికల వల్ల బలమైన అభ్యర్థిని నిలబెట్టే అవకాశం ఉంటుందని జగన్మోహన్ రెడ్డి తెలిపారు.

====================

జార్ఖండ్, ఉత్తర ఒడిశా ప్రాంతాలలో ఏర్పడిన నిన్నటి అల్పపీడనం ఈ రోజు జార్ఖండ్ దాని పరిసర ప్రాంతాలపై కేంద్రీకృతమై ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టం నుండి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని పేర్కొంది.

====================
====================